# తమ్ముడు పెళ్ళికి తర్లీ వెళ్ళడం

భమిడిపాటి కామేశ్వరరావుగారు

అబ్బే, ఏంలేదండీ! ఓనాడు తెల్లవారీ వారడంతోటే ఉదయం రైల్లో ఊరికే పిరంగిగుండులా ఊడిపడ్డాడు, మా మేనమామ, కాకినాణ్ణించి. ఇల్లా యింకా గుమ్మం దాటి లోపల పళ్లేదు, అపళంగా హాత్తెరీ అని దొరకపుచ్చుగున్నాడు మమ్మల్ని! "పెళ్లి పెళ్లి పెళ్లి, వ్యవధి లేదు వ్యవధి లేదు" అంటూను. కాళ్లు కడుక్కోడు, కూర్చోడు, ఆగడు, ఆలోచన తోచనివ్వడు, "శుభస్య శీఘ్రం అన్నాడు. కళ్యాణం వచ్చినా కక్కొచ్చినా ఆగదు. పెద్దలంతా వ్యాపారం అల్లా రైటు చేశారు. ఇహ చూస్తే లాభం లేదు, నడుం కట్టాలి గాని!" అంటాడు. నిజమే ఆమాట. పుట్టడానికి పూర్వంనించీ గూడా అనుకుంటూనే ఉంటాంగా మేనరికం సంబంధం! కాని, మన్లోమాట, మాతమ్ముడూ తనదయవల్ల ఏవో రొండు ముక్కలు చెప్పుగుంటూ ఉన్నవాడేగాని వొట్టి రికామీమనిషి కాడు. వాడికీ కోఅంటే కోటి మంది అన్నట్టు వస్తూనే ఉన్నారు, లాంఛనాలు మినహా కట్నం, ఓపిల్లికూనదాకా చెబుతూను. ఏంజరిగితేం, మాకు మొదణ్ణించీ దీనిమీదే ఉంది మనస్సు, కానైతే. అందుకన్లేదూ! ఏదో ఆడపిల్ల వాళ్లం మేం అయినట్లు అతగాని ధోరణికి చెబుతున్నా! మేనరికం అంటే కన్యాప్రదాతకి కాస్తంత స్వరాజ్యంగావును! రెండుమూడు దఫాలు విశ్వప్రయత్నం చేశా అక్కడికీ—"చెప్పావు కాట్టయ్యా, కాస్త నిదానించు, గుఱ్ఱం దిగు కొంచెం మరి; ఇల్లా కచ్చల్లో కందులు వేయించితే ఎల్లాగు? వెనకాముందు చూసుగోనీ. కావలిసిన వాళ్ల మేగదా, ఏదో పైసలు చేద్దాంలే!"—అంటూ పెట్టి ఒక్కరవ్వ కసురుగున్నట్టు డబాయిద్దాం అని. అయితే అతనెక్కడ? అబ్బే! ఉఁహుఁ. తను చెప్పేదేదో అదేగాని, తెడ్డయినా మామాట చొరనియ్యండే! మళ్లీ మాట చెప్పడంసొంపు మాఅందరి దగ్గిరా ఉంది. ఉంటేం? ఏమీ అతడు వినిపించుగోండే! ససేం! పైగా, మేనమామ. ఓవేళమాట్లాడ్డాని కాతడు మాకు తెరపిచ్చినా మేం అతణ్ణి నెగ్గగల్తమా? అమ్మయ్యా! ఏదో అభోజనం చేసేటప్పుడు ఆ ఆసామీ ఏం తమాయించాడోగాని, అస్తమానం ఒక్కనరసగా ఉన్నాడూ, మరోక్కవారం ఉంది ముహూర్తం అని కాయితంమీద రాసిచ్చాడు లగ్నం అదీని. సరి ఆమధ్యాన్నవేళ రైల్లో గావును వాళ్లవూరు నిష్క్రమించాడు.

అవునా; ఉన్నమాట అనేస్తే తీరిపోతుందీ, నాకు మాత్రం మాచెడ్డతట్టుగా లేసుకొచ్చింది, చెప్పద్దూ! కాని ఏమిటి చెయ్యడం! పెద్దవాడూ! మరోటీ, అతనన్నదీ నిజమే! శుభశోభనాదులనీ ఏదో చకాపికీగా గబగబా హైరానగా అయిపోతూంటాయిగాని, ముందెంత గుణించుగు కూర్చున్నాసరే వీటిల్లో స్థాయిగా ఉండడం బహుఅరుదు. ఒకసారి నేనుకూడా అర్థ ఆలోచించాను. "ఇక పెళ్లికీ, నడుక్కీ అంటూ ఇంతంతా ఇంతంతా లేరు మనికి చెల్లిళ్లూ తమ్ముళ్లూనూ. చెల్లిల్ని అత్తారింటికి పంపేశాం, తమ్ముళ్లు ఈవరకే సంతానవంతులయ్యారు; ఎటొచ్చీ ఇహ నాలుగో తమ్ముడు వీడొక్కడూనూ. వీడుకూడా ఓయింటివా డవడమే గదా మనం కోరేదీనూ. ఊహూ, మంచి చెడ్డలు చెప్పడానికి మాత్రం దగ్గిర పెద్దవాళ్లెవరున్నారు గనకా" అని తలపోసుగుని, నేను మనసు నిబ్బరంచేసుగుని, నాస్నేహితుడు ఒక మేష్టరు మా భవనంలోనే మరోభాగంలో కాపరం ఉంటే ఆయన్ని తక్షణం కలుసుగుని, హైసా అని ఆయనా నేనూ కలిసి పట్టుపట్టుమని కొన్నికొన్ని ఖంజాయింపులు చేసుగుని, రివ్వున వెళ్లి ఉత్తరాలెచ్చి, మా తమ్ముళ్లకీ, పెత్తండ్రిగారికీ, కడమా బంధుకోటికీ, ఈసంగతంతా గోకేసి ఆహ్వానం రాసి, నుంచున్న పళాన్ని వాళ్లని యావన్మందినీ యకాయకీని బయల్దేరి వచ్చివాలమని, పెళ్లికి ఓ ఇదెనీ, ఓ అదెనీ ఆడవాళ్లు పురమాయించిన మీదట ఏవో బజార్లో కొనుక్కొచ్చి ఇంట్లో గిరవాటేస్తూ, ఆముహూ-

ర్తానికే కాకినాడ వెళ్ళడానికి ఆయత్తపడడం వెంటనే ప్రారంభించాం.

పెద్దవాళ్లు కార్యాదులు ఎల్లా కొనసాగించుతారో చ్చారోగాని, ఆనాలుగు రోజులూ మా కేమన్నా ఊపిరి సలిపిందా, కాళ్లు విరగదొక్కుకున్నాంగాని! ముహూర్తం అనే మాటలో ఉంది ఎంత సొగసైనా! అది మానవులే పెట్టుగుని, అదొచ్చి మీద పడిందంటారు. దాని బలిమి ఏంబలిమి? డబ్బు కుదురుతుంది, వీలు కుదురుతుంది, మనసు కుదురుతుంది, చాలామందికి జలుబువొదిలి రోగం కుదురుతుంది, జరిగితీర్తుంది! సంబంధించిన పునిస్త్రీలకి నెలలు నిండడంగాని, సంబంధించిన ముసలమ్మలకి ఏళ్లు నిండడంగాని జరక్కుండా ఉండాలిగాని ముహూర్తం మానవులకోసం ఆగదు. ముహూర్తాలంటూ పెట్టకపోతే, మన్లో ఉండే విధ్యుక్త కార్య నిర్వహణానికి ఒక్క పెళ్లీ పడకనే పోను అసలు! ఈమాట అందరికీ తెలుసు. అంచేత దూరపుబంధువులైనా అశ్రద్ధలు చెయ్యరు. చేసినా పాకెన్న దాటనివ్వరు. కావలిసినవాళ్లు పిలుపందక పోయినా రాక మాన్నేలేరు. వచ్చి తమరికి సరియైన పిలుపే లేదని దెప్పడం గునవడమూనూ. గునవడానికి బాగా సావకాశం ఉండేనిమిత్తమే పెళ్లి అయిదు రోజులంటూ ఏర్పరిచింది అని కొందరి ఊహ. సరి, మా వాళ్లూ నా ఉత్తరాలు చూసుగుని సెలవ చీటీలు రాసి పారేసి, ఆమట్టున చక్కావచ్చారు. క్రితంనాడు మధ్యాహ్నని కప్పుడే మా పెత్తండ్రిగారూ, వాళ్ల వాడూ, పిల్లలూ అంతానున్నూ నిమ్మ నిమ్మణంగా ఒహొక్కరే ఒహొక్కరే నాఅన్నవాళ్లంతా జేరుకున్నారు ఎల్లాగైతేం. ద్వారబంధానికి తోరణంగట్టి, పెళ్లి కొడుకుకళ్ల కి కాటికా, బుగ్గని చుక్కా పెట్టేటప్పటికి వొస్తుంది కావున పెళ్లికళ. అపళంగా అదివరదాకా సంసారపక్షంగా ఉంటూన్న ఇంటిల్లపాతి జనంలోనూ ప్రతీ నస్మరంతిగా దూకూడా గొడ్డలిపెట్టుగా ఒక గొప్ప మొగపెళ్లివాడుగా మారిపోయి ఊరుకుంటాడు. అక్కణ్ణించి అడుగులు లెక్కెడుతూ నడిచేవా డొకడూ, నిద్దరోతూ మాట్లాడేవా డొకడూ, అభోజనం పడుకుంటానని గడ్డంపట్టించుగునే ధీరోదాత్తు డొకడూ, తాను భంట్రోతంటే తనికి భంట్రోతనే ఘురానావాజమ్మ ఒకడూ, "అబ్బ! వాణ్ణెళ్ళమందూ, దుక్కలా ఉన్నాడూ!" అని ఎగేసేమందు డొకడూ ఆవిర్భవించడంవల్ల వ్యాపారం తారుమారవుతుంది. కాని, సందడి అంటే అదే సందడిలెండి మరి! "ఈదార్లో తుంగచాప పరిచారెవరూ?"—(ఎవడు చెబుతాడు సమాధానం?) "ఈటముకు పెట్టి ఎవరివట్రా, కాలు బద్దలవుతూనూ?" "ఏమట్రా, మూడుకోతల దంతపుకువ్వెన్న చూడలేదుకదా, మీ రెవరూ?" "ఇదుగో, చూడూ! నాపట్టు తాపితాలు ఎక్కడున్నాయి? ఇయ్యి, అవీ మరచెంబూనూ!" "ఈవెధవని తియ్యవే ఇక్కణ్ణించీ! తీసి నీళ్ళట్రా" అంటూ అనవరతమూ కేకలు వినబడుతూ, చంటిపిల్లల గుక్కలట్టడాలూ, కాస్తపెద్ద పిల్లల అల్లర్లూ—పల్లకీలో కూర్చోడానికి తగూలూ, గాయికంవచ్చినవాళ్లు మొత్తుకున్నా వినిపించుగోకుండా పేకాటలూ, ముసిలివాళ్ల కూకలెయ్యడాలూ లాంటి వాటితో నిండిఉంటే అప్పటి ఆవైభవం సంసారసౌఖ్యసారం అనచ్చునేమో! చెప్పొచ్చేముక్క, మేమంతా ఇంకా ఆడపెళ్లివారి ఊరెళ్లి వాళ్ళేర్పాటు చేసే విడిదిలో దిగకుండానే, ఇక్కణ్ణించీకూడా తయారుగానే ఉన్నాం. ఇంతంత గలిభీ, హడావిడీ జరిగిపోతూంటే పైవాళ్లమైతే మహచెడ్డ సొగసుగా చూడచ్చు! కాని ఎవరో ముగ్గురో నలుగురో నడుంకట్టి వ్యాపారం అంతా చక్కపెడుతూ, అడిగినవి ఇవ్వడానికీ, ఇచ్చినవి అమర్చడానికీ, అమర్చినవి ఉపయోగించడానికీ, వెన్ను వాల్చడానికేనా తీరిక లేకుండా యెముకలు పొడుంగావలిసిన వాళ్ళు ఉండితీరాలిగా! ఇక్కడ ప్రస్తుతం నేనల్లాంటి వాణ్ణి. ఇహాను ఆతెల్లారకట్ల అయిదుగంటల రైలుకే ప్రయాణం. అంతా పడుకున్నారు. నేను వీలైనప్పుడల్లా ఓకునుకులాగుతూ లేస్తూ గడిపాను. మాఆవిడమాత్రం—మరి పెద్దలు ఇంట్లో లేరుగామరీ!—రాత్రెల్లా చిమ్మెటల్లా ఏదో సవిరిస్తూనే ఉంది; సవిరింపు తెమల్నేలేదు.

ఇక ప్రయాణ సరంజాం కల్లామూలం మావాళ్లు నాలుగు బళ్లు చెప్పొచ్చారు. చెప్పొచ్చీ, ఇహ తమ

నిద్దర సంగతేగాని మరి బండీవాళ్ల అతీగతీ కనుక్కో-
లేదు. వాళ్లూ చాలాసేపు అరిచారట, ఆగారట, ఏం
తైనా తంటాలు పడ్డారట. కాని ఛస్తారా ఏమిటి,
ఫికర్లేకపోతే! ఆపళంగా విసుగేసుగొచ్చి వాళ్లు మాయ
మై చక్కాపోయారు: ఈసంగతి నాకు నాలుగు గంట
లకి మెణుకువ రావడం ఏమిటి, తెలియడం ఏమిటి,
రెండూ ఓమాటే జరిగాయి! బండివాళ్ల పిలుపులు విని
పించుకోనందుకు నాకు చ్రురుమనిపోయింది—నేనైనా
తప్పనిసరివల్ల కోప్పడతానుగాని, నేనుమాత్రం వినిపిం
చుకో కూడదూ!—ఆఁ, అప్పట్లో కడం వాళ్ళ నందర్నీ
లేవగొట్టడం శక్యం అయిన పనిలా కనపడక, తీరా రైలు
దాటిపోతే (అందర్నీ కదుపుగుని వెళ్లేటప్పటికి), మళ్లీ
స్నాతకం అద్దుతుందేమోగదా అని కూడలెత్తి, "పోనీ,
కొంతమంది ముందు వెడితే!" అనిపించిందినాకు. సరి, పెళ్లి
కొడుకొకూడూ—పెళ్లికి పెళ్ళికొడుకూనా అన్నట్టు—
నేనూ, మావాళ్లూ వెళ్లి తీరాలిగా! తక్షణం, "రైలు
వేళయింది లేవండర్రోయ్" అని ఇంట్లో మేఘధ్వనిఓటి
ఖర్చుపెట్టి, మేం ముగ్గురం ముఖ్యం అనుకున్నదీ, చేతికి
అందినదీ ఊచిపుచ్చుగుని, రైలుస్టేషన్కి ఎగడ్డాం.
కొంతరంగం ధౌడు తీసేటప్పటికి, ఓఒంటెద్దుబండీ
కునికిపాట్లు పడుతూ మాకు ఎదురుపడితే అది బేరం
లేకుండానే వెనక్కి స్టేషన్కి పట్టుకున్నాం. ఎట్లానో
బాధపెట్టగా, వాడు ముందుబరువూ, వెనకబరువూ, అస
లుబరువు అంటూ మమల్ని కొరుక్కుతినేసి అఖీషూ
స్టేషన్కి ఈడ్చుగు పోయాడు. స్టేషన్లో ఊహూకో
లాహలం బయల్దేరింది—ఇటోటి అటోటి రెండు రైళ్ళు
న్నాయిలెండి, అప్పుడే! మా రైలు కర్ణశూలంవంటిరాక్ష
సికూత ఓటి ఎక్కడకూసి తోకముడిచేస్తుందో అనినాకు
ఓటే బెంగ! "డబ్బిచ్చియ్యండి, బాబుగోరు, యెల్తాను!"
అని బండీవాడు. నాదగ్గిర చిల్లర్లేదు. "ఉండరా,
టిక్కెట్లు కొన్నతరవాత నీడబ్బు నీమొహాన్ని కొడ
తానూ!" అన్నాను. అంటే వాడు అల్లా ఎల్లాగండీ అని
బలవంతపెట్టి, నుంచున్నపాట్న కక్కచుని కూర్చు
న్నాడు. "నీమొహం దగలేసిరిగదరా, నీమొహం దగ
లెయ్యా!" అనుకుని, గొడుగుంటేను చేతులో, అది
వాడి మొహంమీద కొట్టి, "ఇదుచ్చుగు ఏడవరా, డబ్బి
చ్చిందాకానూ!" అని నేను నోటుపైకి తీసి పరిగెట్టి,
కిటికీ దగ్గిర ఉల్లాసీదా అంతపని జరిగి, ఎల్లానో మూడు
టిక్కెట్లు కొయించాను. మావాళ్లిద్దరూ మించిపోయి
నట్టు స్టేషన్లోకొచ్చి దిక్కులు చూస్తూ నిలబడ్డారు.
ఇంతట్లో నేను చిల్లరట్టుగుని "ఇదుగో రోయ్" అంటూ
బళ్లదగ్గిరికి వెళ్లేటప్పటికి, ఏడీ బండీవాడూ! ఈభూప్ర
పంచంమీద లేకుండాపోయాడు. "నాలుగుంబావలా
కిమ్మత్తు అసలు బుట్టమార్కుదే, నిక్షేపంలాంటి గొడుగు,
నీపొట్ట నెట్టుగున్నావుట్రా, నీపాడుగు బొగ్గులుగానూ!"
అనుకున్నాను. అనుకుని, మావాళ్ల మీద కొంచెం చిర్రు
బుర్రు మన్నాను, వాడికోసం ఎల్లానూ బయల్దేరిన కోపా
న్ని నిరర్థకంగా అంతరించిపోనీకుండాను!

ఇంతట్లో, ఇంటిదగ్గిర నాకేకతోటి మావాళ్లంతా
ఠాగేస్తే తేనిపట్టు రేగినట్టు ఒక్కమాటు చలించారట.
ఓముగ్గురు తెగతిరిగి నాలుగు వీథులూను, బ్రహ్మాండం
మీద రెండుబళ్ళు సమకూర్చి యింటికి తెచ్చి, వాటి
ల్లోకి పెళ్లివారిసామాన్నీ పెళ్లివార్నీ చిటికెలోరవాణా
చేసి పారేశారట. ఇహ బయల్దేరపోయే సమయాన్ని
కరకమ్మగారు తనతల్లిని తీసుగుని, ఓట్రంకుచ్చుగుని,
ఓఅరిటిగెల వేసుగుని కాకినాడ లేనూ వస్తానంటూ కా
ళ్లకి అడ్డంపడిందిట. కరకమ్మ మాకు చుట్టంకాదు
పక్కంకాదుమ్మండి, మాహావేళీలోనే ఉంటూన్న వారు
గావిడ. క్రితం ఆర్నెల్లనించీ ప్రతినిత్యమూ నేను ఆవిణ్ణి
చూస్తోచ్చినా, ఎప్పుడూ సంబోధించలేదు. వినడం
ఆవిడ దొడ్డమనిషే అని. మనిషి ఊరికే సన్నంగా కదు
రులా పేనులా ఉంటుంది. నిజమేనండి, ఉత్త అటు
గ్గింజ, పాపం! కాని, కట్టెపీలగా ఉంటేం, గాత్రం
మాత్రం మహాగట్టిది గావుకేక లెట్టడానికి. కాయశరీరం
ఏమో, ఆవిడ అనేక పుష్కరాలకి కోటిలింగాలరేవులో
స్నానం చేసింది. ఆవిడికి ఓతల్లి. ఈవిడికి కన్నూకాలూ
కొంతవరకే ఉన్నాయిగాని, మడీ ఆచారంమట్టుకు చెక్క
పూటుగా ఉన్నాయి. వీరికి ఓట్రంకుట. అబ్బే, ఎంత
ట్రంకండీ, నా మొహం! ఉత్త మన పెద్దబాలశిక్ష పుస్త

కంఠం అంతాయె. పైపెచ్చు ఓ చిన్న అరిటిగెల! వీళ్లు ఎక్కడికక్కడికే అని పెళ్ళివాళ్ళతో తెల్లారగట్లే తయారయారు, సమూహంలో కొట్టుకుపోవచ్చుగదా అని. సరే అనుకున్నారట మావాళ్ళు. అనుకుని ఓ రెండు నిముషాల్లో వీళ్లనీ ట్రంకునీ అరిటిగెల్నీ సర్ది ఎక్కడోను బళ్ళు తోలుకుని మేహాలమీద వచ్చిపడ్డారు స్టేషన్కి. గుడ్డిలో మెల్ల, ఇంకా మా రైలు కదల్లేదు. వస్తూనే, మా రెండో తమ్ముడు నాదగ్గిరి కొచ్చేసి, "మేస్టారు సాయంత్రం వస్తానన్నాడు. మనికి పన్నెండు టిక్కట్లు కావాలన్నయ్యా!" అన్నాడు. "సరే. మీరెళ్ళి సామాన్తో రైల్లో పడండి!" అని నేను అదివరలో కిటికీదగ్గిర మోచేతితో పిడీల్తో టిక్కట్లు కొన్నవాణ్ణి ఇప్పుడు లోపలికెడితే ఏదో మహా పొడిచేస్తానన్నట్టూనూ, మనికీ ఉద్యోగమేగదా, టిక్కట్ల గుమాస్తా నన్ను మన్నించకపోతే యెరగడా మనమజాకా అన్నట్టూనూ, గిరుక్కున తిరిగి లోపలికెళ్ళి, "అయ్యా! దయచేసి కాకినాడకి పన్నెండు!" అని జాతిభాషలో అడిగి, ఆ టిక్కట్లూ చిల్లరా బహునమ్మకంగా—మళ్లీ పల్లెటూరి గబ్బిలాయికిమల్లే తిరిగీ లెక్క పెట్టుగుంటూ కూర్చోక—జేబులో వేసేసుగుని, ఏదో గొప్ప దిగ్విజయం చేసినట్టు గరాగరీగా ఇవతలకి వస్తూంటే ఒకడు "అయ్యా! ఈ టిక్కట్టు ద్వారపూడికేనా చూసిపెట్టండి!" అని నన్ను కనుక్కునేటప్పటికి, నేను "అయ్యో! పిచ్చిపుల్లాయిలా ఉన్నావేమిటి, ఎక్కడో! అక్కడికే!" అంటూ వాడి అతిజాగర్త అసహ్యించుగుంటూ చక్కాపోయి, మావాళ్ళంతా బండీలో పడగలిగినందుకు ఆనందపడి, ఇహ రైలుకూసి పొగవొదిలి ముందుకి సాగేవేళకి నేనూ ఎక్కేసి పెట్టి తలుపేసుగుని, "అమ్మయ్య" అనుకుని లోపలకూర్చొపడ్డాను.

రైలు "ఆఁ నేను వెళ్ళను" అన్నట్టు కొంత హరామీచేసి వెనక్కి కదలడం మొదలెట్టింది. ఆపళంగా రైలువాడు "ఏడిశావు, నడుద్దూ, నీయిష్టంఏముండీ!" అన్నట్టు చెవులు గింగురెత్తేలాగు కైంయ్యిమని గావుకూత ఓటేసి, రైల్ని నసాళం అంటేటట్టు ఒక్కటేశాడు. దాంతోటి పాపం రైలు సెమట్ళు కక్కుగుంటూ పరిగెత్తడం మొదలెట్టింది. కావలసినంత బలం ఉంది రైలుకి! ఉండేం? అన్ని పుట్ల ఇనపసామగ్రీకూడా ఒక్క నరమానవుడు ఎల్లా చెబితే అల్లా వింది, వొదిలిపోయింది. నాకేమైందీ? రైల్లో పడ్డానికికాదూ సహాళతో కుక్కల్లాటా జరిగిందీ, ఆ పట్టున కిటికీలోంచి కొడుతూన్న ఆ ప్రభాతమందపవనం ధర్మమా అని కళ్లు ఇట్టేమూతడి ఊరుకున్నాయి. నిద్దర కూర్చునప్పుడు మరీవొస్తుంది. ఒక్కొక్కప్పుడు కూర్చుంటేనేగాని రానేరాదు, ధాంతగలెయ్యా! అల్లాగే కాస్సేపు జోగి, ఓ తభరకా, ఆకుని! పాట్ల షికారులో నేను మరీ జోరుగా కుడిపక్కకి ఒసిలేసరికి గభీమని మెణుకువ చక్కావచ్చి, "ఎక్కడికొచ్చాం?" అన్నాను. అంటే "ద్వారపూడి దాటాం!" అన్నాడు మా పెత్తండ్రిగారివాడు. ఏమోగాని, "ద్వారపూడి" అనేది చెవిని పడ్డంతోటే నాకు మహాభయం వేసిపోయింది చెప్పద్దూ! అప్పుడే రెండోమాటు వినడం మరి ఆపేరు. అనేంజేశాఁమా మావాడూ! నేను పైన తగిలించిన నాకోటుజేబులో—పొడుంకాయకోసమే అని జ్ఞాపకం—నిమ్మళంగా చెయ్యెట్టాడు. పెట్టేటప్పటికి టిక్కట్ల దొత్తరతగిలింది; యాదాలాభంగా అది పైకి తీశాడు. అప్పటికి తెల్లగా తెల్లారింది తీసిచూసి, "ఇదేమిట్రా, ద్వారపూడీ!" అని చదివాడు. అయ్యా చెబితే మీరు నమ్మరూ! నాకు ఒళ్ళునీరైపోయి ఉపద్రంగా భయం, దారుణంగా కోపం బయల్దేరాయి. వాడు, సరిఆటికట్టు వెనక్కి పెట్టి తరవాత దానికేసి చూసి "ద్వారపూడి" అని మళ్లీ చదివాడు. "టిక్కట్లమ్మే ద్రోహిగా, ఎంతపనిజేశావురా, నీమొహాన్ని జీడెట్టా!" అనుకున్నాను. నాకళ్లు చింతనిప్పలులా ఆయిపోయాయి. మావాడూ ఒకొక్క టిక్కట్టే తీస్తూండడం చిలక్కిమల్లే "ద్వారపూడి, ద్వారపూడి" అని చదువుతూండడం లంగించుకున్నాడూ! అల్లా పన్నెండు టిక్కట్లు ద్వారపూడికని చదివాడు. చదివి, "ఒరేయి, ఇంకా మూడు ఎక్కువఉన్నాయి యెందుకురా?" అన్నాడు. అనీ, అవిమూడూ కాకినాడకని చదివాడు. అంతాకూడా ఊరికే విస్తుపోయి ఊరుకున్నారు. మా రెండో తమ్ముడు నాకేసి తిరిగి "ముందొచ్చిన మీముగ్గురికీ టిక్కట్లు పుచ్చేసుగున్నావా ఏమి

త్రా, లేదనుకుని నేను పన్నెండు చెప్పానూ!" అంటూ సర్దటం మొదలెట్టాడు. "ఏడిసినట్టే చేశావు! ఇంతేపన్లు! దమ్మిడీసాయం లేదు. మాగోడవెందుకు, తరవాతొచ్చిన స్వరూపాల సంఖ్య నేనడిగి లేనూ!" అని నేను లేచాను. "ఒరేయి, నువ్వూ చదువుకున్నవాడివేగదా! నేను 'పన్నెండు' అనేటప్పుడు "నేను ఇల్లా ఇల్లా మాముగ్గురికే టిక్కెట్లు పుచ్చుగున్నాను. కడంవాళ్లెందరు?" అని నాతో చెప్పి మరీ అడగద్దుట్రా? అది చెప్పదా! పోనీ, ఎవో కొన్నవాడవు ఎల్లానూకొన్నావు గనక చూసుగో వద్దా, అవి ఎక్కడికిచ్చాడో?" అంటూ మావాడు అందుకున్నాడు. "ఏముంది వొత్తి భడవారకం, తెలివిమద్దెపు దద్దమ్మలు వీళ్లు?" అంటూ కుర్రాళ్ల మీద నేను, "నీ పెద్దతనం మట్టుకు? ఉన్నమాట మనస్సులో పెట్టుగు ఇవయావు?" అంటూ వాళ్లు. ఇంతలో ఆడవాళ్లు, "ఇందులో తక్కువ తిన్నవారెవరు? అందరి ప్రయోజకత్వాలూ ఒక్క టాకీగానే ఉన్నాయి, అడగాలీవేలేను?" అని ఈసడింపులు మొదలెట్టారు. నాకు రావణాశేచిక్కవేసింది. అంతా స్వజనం అయిపోడం వల్ల ఊరుకున్నానుగాని, లేకపోతే ఒక్కొక్కర్ని ఇల్లా చీరేసుందును.

రెండోకంటినా డేరక్కుండా, గుడ్డ నీళ్లు కుక్కుగుని, ఈసంగతి కప్పెట్టేసి పైకి మామూలుగానే కనపడగలిగితే వ్యాపారం దివ్యచకోరంగా ఉండేది, సరిపోయేది. కాని అబ్బే, మేమా! వాదప్రతివాదన్లతో పహోరు జోరైపోయింది. వాటిముందు రైలుచప్పుడు చప్పపడిపోయింది. రైలుఆగిందో, నడుస్తోందో, భోల్తావేసిందోకుడా మాకు నిమిత్తం లేకుండా పోయింది. గొడుగా పాయె. టిక్కెట్లూ మూడు దండగాయె. కడంవా ద్వారపూడికి తనులడ్డాడాయె, నాడి ద్వారపూడి గొంగల్దూరా! ఓకైతే ఏడుద్దుం! అక్కణ్ణించి 'చాల్లే తెలివి' అంటే 'చాల్లేతెలివి' అనుకుంటూ, 'నీమూలాన్నే' అంటే 'నీమూలాన్నే' అనుకుంటూ, ఒకరిమీదఒకరు నేరం మోపుతూ, అడ్డమైన హడావిడిలోనూ పడిపోయాం. రైలెప్పుడో సామర్లకోట స్టేషన్లో ఆగి ఊరుకుంది. ఉత్తరక్షణంలో శుద్ధ ఖంగారుతో, లోపల గోణుగులు, పైకి ఉలుములు, రుసరుస, తీవ్రంగా చూపులు, చేతులో వస్తువు నేలనెట్టికొట్టడం—వీట్లతో అతికోలాహలంగా కొందరం దిగి ఆడవాళ్ల నీ పెట్టెల్నీ దింపడం—ఇల్లా మొదలెట్టామో లేదో ఇంకా, ఆపళంగా యమకింకరుడులాగ బాగా ఓ తాడిచెట్టంత మనిషైతే చక్కావచ్చి,—మాసంగతి వాడెల్లా విన్నాడో, వినకుండా పసేపట్టాడో ముండావాడు—ఊచి పుచ్చుగు లెంపకాయ లాగినట్టు, "టిక్కెట్, సార్" అన్నాడు నన్ను. ఇంకా మేం దిగీ దిగకుండా ఉన్న అవస్థలో ఆఫీసరునైన నన్ను ఒక అల్పుడు ఇల్లావొచ్చి దుయ్యబట్టుగోనా అని నాకు పట్టరాని రోషం వచ్చింది. అయితే మాత్రం, రోషాలు పనికొస్తాయా, ఆవేశాలు పనికొస్తాయా చేతులారా చేసుగున్నతరవాత, చెప్పండీ! అప్పుడు, నేను టిక్కెట్లు ఉన్నవాడి బాబులా నటిస్తూ ధిమాకీగా చిరునవ్వుతో, "ఉండవయ్యా! దయచే ,దిగనీ ముందూ!" అన్నాను వాడు తొందరగా ఇంకోర్ని అడగడానికి విరగడై పోతాడేమో అని. అంటే, అబ్బే! వాడెక్కడొదుల్తాడూ! మమ్మన్నే పట్టుగున్నాడండీ తిన్నగా వచ్చి! ఎల్లా పోల్చాడో, వాడి తస్సాగొయ్యా, వాడిదామరి ప్రజ్ఞ, తక్కినవాళ్లదా?

పెట్టెలు దింపారు. చివరకి కరకమ్మగారి తల్లిని కూడా కిందికి సాయం పట్టారు, అనగా రైల్లోంచి. దాంతోటి, అరిటిగెల దింపడం పనికూడా అయిపోయింది—అంటే ఆవిడ ఒళ్లో పెట్టుగు కూర్చుంది కాదూ మరిగెలా! ఇంతలో రైలు కాలకృత్యాలు తీర్చుగుని, ఊగిసలాడి, కూసి విరమించింది. మేం, ఇహ, మమ్మల్ని పట్టుగున్న మనిషి దెయ్యాన్ని వొదిలించుగుని, కాకినాడ టిక్కెట్ల గొడవ చూసుగుని ఆ రైల్లో వేగరం వెళ్లిపడాలీ అనుకుంటూంటే, ఎంజేసిందీ కరకమ్మగారూ! మాంచి దెయ్యమల్లా చూపూ ఆవిడానూ, "అయ్యోయ్యా, హాయ్యోయ్యా, అయ్యోయ్యా, హాయ్యోయ్యా" అంటూ మొదట చిన్నచిన్న కేకలెట్టి, అక్కణ్ణించి, ఏమని చెప్పను, ఓ తరవాయి లేకుండా, ఓకూను స్వరాలుగావు, ఓదీర్ఘాలుగావు, ఓరాగాలుగావు, మూదుంపతెంపి, పెద్దపెట్టున శోకన్నాలు లంగించుగుంది, కొండవిరిగి మీద పడ్డట్టూ! మామూలుగా

నేను కోపిష్ఠినికాను, ఏతత్పూర్వం ఆవిడతో ప్రసంగించాలేదు. కాని,రంగం మారిందిగా! అక్కడతోటి నేను పళ్లు పటపటా పిండెల్లా కొరుకుతూ, "నువ్వెకడ దాపరించావమ్మోయ్, మంచి శనిలాగోయ్! నీకేమి ఏ క్షెత్తు వచ్చిందమ్మోయ్, నీకేమి ఉప్పెనవచ్చిందమ్మోయ్,అంత ఏడుపుకోయ్?" అంటూ గుక్కతిరక్కుండా గర్జించడం మొదలెట్టాను. "టికేట్, టికేట్" అంటూ టిక్కట్లు సైతాను సంపాదించడం మొదలెట్టాడు. "నాభవిష్యం అంతా మట్టికొట్టుకు పోయిందండోయ్! నా వెండిబంగారాలకీ నాకూ ఎడబాపులు వచ్చాయండోయ్! ఇంతమందున్నారు మళ్లీ, ఆ స్త్రీ పిట్టలాగ లేచిపోతూంటే పట్టుగోలేక పోయారండోయ్!" అంటూ కరకమ్మ మరీ గోల చెయ్యడం మొదలెట్టింది. పిట్ట కొద్ది, కూత ఘనం అన్నట్టు ఇంతంత పొలికేకలూ నాటు మేకులా ఉన్న కరకమ్మ వెయ్యగలదని నేను లోగడ ఎరుగున్న వాణ్ణేకానైతే. అప్పట్లో పోనీ అది పబ్లీకు స్టేషను గందా కాస్తనడి తగ్గించుతుందేమో అని భ్రమించాను. భ్రమిస్తే! హెచ్చించింది తస్సాగొయ్యా. నాకు వొళ్లు భగ్గుమని రవిలిపోయి ఆ పైమజ్జనంలో నేనూ అందుకున్నాను. అందుకుని, "నీది పోయిందేమిటమ్మోయ్, అసలోయ్! మాతో ఆమాట చెప్పితగులడవమ్మోయ్! శుభానికి వెడుతూంటే నీ ఏడుపు బాజాలేమిటమ్మోయ్! ఓఘాయిత్యం కూడానూ! నువ్వేమిటమ్మా మాకోయ్! పెళ్లి కెడుతూ పిల్లిని చంక నెట్టుగువెళ్లినట్టు నిన్ను పట్టుగొచ్చారేమిటమ్మోయ్, మావాళ్లోయ్! పెళ్లిలో దెబ్బలాటలు పెళ్లికొడుక్కీ పెళ్లికూతురికీ తప్ప కడంవాళ్లిందరికీ నమ్మోయ్!" అంటూ జ్వాలాతోరణం లా చెలరేగి పోయాను. "నా టముకు పెట్టె రైల్లో కొట్టుకుపోయిందండోయి. అందులో ఉన్న రొండువందలకీ తిలోదకాలైనాయండోయి" అని కరకమ్మ బాహాటంగా ఏడుపు సాగించి, నెత్తి బాదుకుంటూ చెప్పడం మొదలెట్టింది. సరి, యీ యేడుపులో తల్లి కూడా మూలుగుతూ మద్దత్తింది. మద్దత్తై, వణుకుతూ "మందో వాళ్లదో చూసి మరే ఎడవ్వే అమ్మాయోయ్, అవసరంగా ఏడిస్తే తరవాత మళ్లీ ఏడవాలి" అంటూ కూతురుతో సలహా. అక్కణ్ణించి నేను "అపృచ్ఛపుమాట లెందుకమ్మా! ఇరవై పెట్టెలు దిగాయికందా మావి, నీకు ఒక్కగాని ఒక్క పెట్టాయిరి (తలగడా అంత)? మనుల్ని చంపుకు తినడానికి కాకపోతే, నీకొచ్చిన యేళ్లకి, అదొక్కటే నువ్వు దాటపెట్టుగోవాలీ, చెప్పూ! గాల ఆముసిలిదే పట్టుగుందికదా, నువ్వు చేస్తూన్న ఉద్యోగం ఏమిటి, వెధవ ఉద్యోగం నువ్వూను! "అల్లాగ- ఇల్లాగ అంటూ నేను మండిపడ్డాను. ఏమడుగుతారుకథా! నేనేమో కారాలూమిరియాలూనూ, ఆవిడా తల్లీ! హాలోలక్ష్మణా అని ఏడుపులూ పెడబొబ్బలూనూ; పక్క టిక్కట్లుతణికీవాడు సతాయింపూ! మావాళ్లు "ఊరుకోరా, అబ్బా! ఊరుకోవమ్మా!" అంటూ. ఊహూ లబాయిలూ ౯బాయిలూనూ!ప్లాట్ ఫారం మీద అశేషజనం ఆశ్చర్యంవేసిపోయి నవ్వులకి పడ్డారు. అప్పుడు, మహారసకందాయప్పట్టులో ఉంది వ్యాపారం, అని చెబుతోచ్చారు, పైవాళ్లు!

ఇల్లా నడాడుతూంటే, ఆకాకినాడరైలుకాస్తా ఉడాయించేస్తుందేమో అని చెప్పేసి, మావాడు-నాతరవాతవాడు-వాడిదగ్గిర(ఏమాటకామాటే చెప్పుగోవాలి) బాగా కార్యనిర్వాహకత్వం ఉందీ!-టిక్కట్లపంతుల్ని కాస్త అసింటాలాక్కెళ్ళి లోపాయికారీగా వాణ్ణి సంతోష పెడతానని వాడికి ఆశపెట్టి వాడిచేత ఇంతమందికీ (సరె,మతిమండినట్టే ఉంది! ముగ్గురికి ఆహూరించాయిగా! కడంవాళ్లకే) టిక్కట్లు తెప్పించి, వాడి కేదో ముట్టచెప్పి, ఓరొండు కరుకురూపాయిలు స్టేషనుమేష్టరు పాదాలదగ్గిర పారేసి, కరకమ్మని తీసికెళ్లి ఆయనకి అప్పచెప్పి-రాజమండ్రీనించి తమతో కలిసి కాకినాడ ప్రయాణం చెయ్యదలచి కూడా వస్తూన్న ఆమనిషి తాలూకు కిమ్మతయిన ఓట్రంకుపెట్టె వొట్టి అజాగ్రత్తవల్ల చెయిదాటి వాల్తేరుకేసి కొట్టుకుపోయిందనీనీ, అది వెనక్కి తెప్పించిపెట్టి ఆవిడికి అందజేసి పుణ్యం కట్టుకోమనీనీ ఆయనతో అనేసి, బతుకు జీవుడా అని అక్కడ ఆవిణ్ణి వొదిలించేసుగుని, మేం అంతా ఈలోపుగానే ఎక్కి నిరీక్షిస్తూన్న పెట్టిలోకి ఇహ రైలు కదుల్తోందీఅనేవేళకి వచ్చిపడ్డాడు. కరకమ్మతల్లి, వాళ్ల బంధువు లెవరో కాకినాడవాళ్ళు కనబడితేనూ, అరిటిగెల ప్రాణపదంగా

పుచ్చుగుని మూలుగుతూ వాళ్ల పెట్టెలోనే కూర్చుంది. సరే, మేం కాకినాడ జేరుకున్నాం మెట్టుకి.

ఆసాయంత్రం రైల్లో వస్తానన్న మాస్నేహితుడు రాత్రి లగ్నం గనక కాస్తకద్దనగానే వచ్చి తరవాత వృత్తాంతం తను చెప్పాడు. అయిదింటికి ఆయన సామర్లకోటస్టేషను ప్లాట్‌ఫారంమీద విహితుల్తో కలిసి మాటాపలుకూ ఆడుకుంటూంటే, గాభుపు కొట్టినట్టు మొహం ఎండిపోయి, కళ్లు బాగా ఇంతలోతుకి దించుకుపోయి కరకమ్మగారు చక్కావచ్చి, ఆయనతో (పొద్దున్న జరిగిన సంగతి సాయంత్రం వచ్చే ఆయనకి కొట్టినపిండైనట్టు) "దొరికిందండి పెట్టె; పట్టుగున్నారు, పాపం! ఏమీ పోలేదు. అరిటిగెల ఎక్కడుందో మీకు తెలుసా" అందిట. "పెట్టేమిటి, అరిటిగెలేమిటి" అన్నాట్ట ఆయన. అంటే, "మాఅబ్బాయి వచ్చాడుగా, మాతమ్ముడూ! మా తమ్ముడికి జీతం! వాడొచ్చి నాపెట్టె టెల్లిగ్రాపులో తెప్పించాడు." అని మళ్లీ అందిటావిడ. అప్పుడు "అయితే ఏమంటారు? పెట్టేమిటి? అరిటిగెలేమిటి? అబ్బాయేమిటి? ఇదంతా యేమిటి?" అని ఆయన తరిచి తరిచి అడిగిన మీదటగావును, ఆవిడ తన పెట్టె తప్పిపోడం—ఏది!—సంగతీ, సందర్భం, దొరకడం, అరిటిగెల తమదే అనీ, అది వాళ్లమ్మ ఎక్కడేనా వొదిలేస్తే, పెళ్లివారు జాగ్రత్తచేసుగుని తలో అత్తం మడిగట్టుకుని నోట్లో వేసుకుంటారేమో అని తనకి భయమనీ, కూలివాడికి డబ్బులిచ్చేసి మేమే అది తమబసలో పడెయ్యాలిసి ఉంటుందనీ, ఏమిటేమిటో చదివిందిట. కాని, ఆ చవటగెల ఎవడిక్కావాలీ? పైగా, ముసిల్ది ప్రాణమేనా వొదుల్తుందిగాని, గెలవొదిలిపెట్టి ఒక్కక్షణమేనా ఉండందే అసలు! సరి, గెల ముసిల్దే పట్టుకుపోయిందని మాస్నేహితుడితో చెప్పేశాం, అక్కణ్ణించి, "ఓరి మన కంగారు బంగారంగానూ" అనుకోడం మొదలెట్టాం.

పెళ్లిపేచీ దీంతో వొదిలింది మాకూ అన్నట్టు పెళ్లి లక్షణంగానే జరిగింది. అంతా చివరంటా సవ్యంగానే ఉంది. ఆఖరికి, మరోమాట! మేం కాలక్రమాన్ని రాజమండ్రీ వచ్చేసినతరవాత, ఇక్కడ తప్పటిక్కట్లు ఇచ్చినాయన, పాపం, జ్ఞాపకం చేసుగుని మాకు డబ్బు ముదరా ఇచ్చేశాడు. బండీవాడు—పోనీ, బండీఆయన—గొడుగు మాకు వాపసు చేసి తనబేడా పట్టుగెళ్లాడు. కాని, "టెల్లిగ్రాం తాలూకు ఇచ్చిన రొండు రూపాయలూ మట్టుకు కరకమ్మగారిదగ్గిర వసూలు చెయ్యలేక పోయానుగదా, తస్సాచెక్కా!" అని కొంతకాలం నేను అనుకోవలిసిన అవసరం వచ్చినా, పాపం, ఆవిడా ఇచ్చేసింది. అవాంతరాలూ, ఒడుదుడుకులూ మధ్యమధ్యేగాని, చివరకి, అబ్బే, ఏంలేదండీ!

---